

సెల్ : 94920 33365


# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

విజయవాడ శనివారం 19-09-2026 సంపుటి: 02 సంచిక : 79 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని

Vijayawada Saturday 19-09-2026 Volume :02 Issue: 79 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani




Contact Number
9059328777

## మమత పార్టీ పేరు, గుర్తు గల్లంతు..

- ఉప ఎన్నికల ముందు దీదీకి మరో భారీ షాక్
- టీఎంసీ పేరు, పూలు--గడ్డి గుర్తును నిలిపివేసిన ఈసీ
- మమతా, రెబల్ వర్గాలు పాత పేరు, గుర్తు వాడొద్దని ఆదేశం
- రెండు వర్గాలు కొత్త పేర్లు, గుర్తులను సూచించాలని ఈసీ ఆదేశం
- అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజినగర్ ఉప ఎన్నికలు
- ఉప ఎన్నికల్లో కొత్త పేరు, గుర్తులతోనే పోటీ చేయాల్సిన పరిస్థితి
- ఈసీ నిర్ణయాన్ని మమతా వర్గం వ్యతిరేకించింది
- రెబల్ వర్గం ఈసీ నిర్ణయాన్ని సమర్థించింది
- రెండు వర్గాలకు వేర్వేరు తాత్కాలిక పేర్లు, గుర్తులు కేటాయించిన ఈసీ

02



## పిల్లల పాస్‌పోర్ట్‌పై కొత్త రూల్స్

- 15 ఏళ్లలోపు వారికి ఐదేళ్లే వ్యాలిడిటీ
- 18 ఏళ్ల వరకు మాత్రమే చెల్లుబాటు
- వయసును బట్టి తగ్గనున్న వ్యాలిడిటీ
- 13 ఏళ్ల వయసులో తీసుకుంటే ఐదేళ్ల కాలపరిమితి
- 18 ఏళ్లు దాటితే కొత్త పాస్‌పోర్ట్ తప్పనిసరి
- పిల్లల పాస్‌పోర్ట్‌లో 36 పేజీలే
- పాస్‌పోర్ట్ ఫీజుల్లోనూ మార్పులు

02



# హార్డ్‌వేర్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్

### రూ.22,177 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం

- 28 ప్రాజెక్టులతో 19,739 మందికి ఉద్యోగాలు
- పోర్టుల చుట్టూ పారిశ్రామిక ఎకోసిస్టమ్
- ఏపీని లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దాలి
- సెమీ కండక్టర్లు.. చిప్ తయారీపై దృష్టి
- క్వాంటమ్ టెక్నాలజీకి భారీ ప్రోత్సాహం
- ఎగుమతుల్లో తిరుపతికి దేశంలో 10వ స్థానం
- రేర్ ఎర్త్ మినరల్స్‌కు ఏపీ హబ్
- 21 ఎస్ఐపీబీల్లో 387 ప్రాజెక్టులకు ఆమోదం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి,**

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ హార్డ్‌వేర్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయడంతో పాటు.. రాష్ట్ర తీర ప్రాంతాన్ని పోర్టు ఆధారిత పారిశ్రామిక, లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన జరిగిన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో 28 పారిశ్రామిక ప్రాజెక్టులకు రూ.22,177.84 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా 19,739 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇంధన, ఐటీ, కమ్యూనికేషన్, ఫుడ్ ప్రాసెసింగ్, తయారీ, పర్యాటక తదితర రంగాలకు చెందిన ప్రతిపాదనలను బోర్డు ఆమోదించింది.

-మిగతా 2 లో






02

## పాకిస్థాన్ మసీదులో ఆత్మాహుతి దాడి..

- ప్రార్థనలు చేస్తుండగా మసీదులో ఆత్మాహుతి దాడి
- ఖైదర్ పఖ్తుంఖ్వాలో ఘటన
- దాడిలో 21 మంది మృతి
- 70 మందికి పైగా గాయాలు.. ఆస్పత్రుల్లో చికిత్స
- మృతుల్లో 15 మంది పోలీసులు
- క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమం
- సహాయక చర్యలు చేపట్టిన రెస్క్యూ సిబ్బంది
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- దాడికి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థా బాధ్యత ప్రకటించలేదు



## నేడు ఏపీలో వర్షాలు

- సాయంత్రానికి అండమాన్ ప్రాంతంలో అల్పపీడనం..
- ఉత్తర అండమాన్ వద్ద ఏర్పడనున్న అల్పపీడనం
- ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరం వైపు కదిలే అవకాశం
- శనివారం 16 జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాల సూచన
- మిగతా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ హెచ్చరిక

**అమరావతి,**

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో శనివారం వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ఉత్తర అండమాన్ పరిసరాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం నేడు (సెప్టెంబరు 19) సాయంత్రం నాటికి అల్పపీడనంగా మారే సూచనలున్నాయని ఏపీఎస్డీఎంఏ

-మిగతా 2 లో

## సెమీస్‌లో భారత్..

- క్వార్టర్‌ఫైనల్లో జపాన్‌పై భారత్‌కు 8 వికెట్ల విజయం
- 57 పరుగులకే జపాన్‌ను కుప్పకూల్చిన భారత బౌలర్లు
- తెలుగు తేజం శ్రీ చరణి 4 వికెట్లతో సత్తా
- షెఫాలీ వర్మకు 2 వికెట్లు.. బ్యాటింగ్‌లోనూ మెరుపు ఇన్నింగ్స్
- 15 బంతుల్లో 40 పరుగులతో షెఫాలీ వర్మ విధ్వంసం
- 6 ఫోర్లు, 2 సిక్సర్లతో చెలరేగిన షెఫాలీ
- 5 ఓవర్లలోనే 2 వికెట్లకు 59 పరుగులు చేసిన భారత్
- మరో 90 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించిన భారత్
- రిచా ఘోష్ 6 బంతుల్లో 12 నాటౌట్‌తో ఆకట్టుకుంది



02



## అంబటి రాంబాబుకు మరో షాక్..

- విచారణకు రావాలంటూ ఈడీ నోటీసులు
- అంబటికి ఈ నెల 11వ తేదీన ఈడీ నోటీసులు
- విచారణకు హాజరు కావాలంటూ నోటీసుల్లో పేర్కొన్న వైనం
- అయితే ఆ నోటీసులు తనకు అందలేదన్న అంబటి
- దాంతో, శుక్రవారం ఫోన్ ద్వారా సమాచారం అందించిన అధికారులు
- ఇప్పటికే అంబటిపై పలు కేసులు నమోదు

అమరావతి,

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. తమ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలంటూ ఈ నెల 11వ తేదీనే నోటీసులు పంపినట్టు ఈడీ అధికారులు ఆయనకు నేడు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అయితే తనకు నోటీసులు అందలేదని ఈడీ అధికారులకు అంబటి తెలిపారు. దీంతో, విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలంటూ ఆయనకు అధికారులు స్పష్టం చేశారు. పలు వివాదాస్పద అంశాలు, చట్టపరమైన కేసుల్లో వార్తల్లో నిలిచిన ఆయనకు, ఈడీ నేరుగా సమన్లు జారీ చేయడం ఆంధ్రప్రదేశ్

-మిగతా 2 లో




## యూపీఐ చార్జీలతో అమెరికా కంపెనీలకే లబ్ధి!

- రూ.2,000 పైబడిన యూపీఐ లావాదేవీలపై ని 0.4% ఫీజు ప్రతిపాదన
- ఫోన్‌పే, గూగుల్‌పేకు భారీగా ఆదాయం వచ్చే అవకాశం
- రెండు సంస్థలకే 80 శాతానిక పైగా యూపీఐ లావాదేవీల వాటా
- ఏటా రూ.16 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల ఆదాయ అంచనా
- చార్జీల భారాన్ని వినియోగదారులపై మళ్లించే ప్రమాదం
- అమెరికా ఒత్తిడి ప్రభావం లేదన్న నిర్మలా సీతారామన్

02

# డిజిటల్ వ్యవసాయంలో ఏపీ దూకుడు

### 52.08 లక్షల మంది రైతులకు ఫార్మర్ ఐడీలు

- 97 లక్షల ఎకరాల్లో డిజిటల్ పంటల సర్వే
- ఏపీఏఐఎంఎస్ 2.0తో ఎరువుల ఆదా
- ఎల్ నినోలోనూ పప్పుధాన్యాల సాగులో 99 శాతం లక్ష్యం
- కంటింజెన్సీ విత్తనాలకు రూ.200 కోట్లు
- 80 శాతం రాయితీపై ప్రత్యామ్నాయ విత్తనాలు
- పంటల బీమాకు 44 లక్షల దరఖాస్తులు
- రూ.16 వేల కోట్ల బీమా రక్షణ
- బీమా క్లెయిమ్‌ల పరిష్కారానికి కేంద్రానికి విజ్ఞప్తి
- రైతు బజార్ల ద్వారా గిట్టుబాటు ధరకు చర్యలు
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అగ్రిస్టాక్‌లో 86.8 శాతం లక్ష్యం పూర్తి

**అమరావతి,**

డిజిటల్ సాంకేతికతను వ్యవసాయ రంగానికి అనుసంధానిస్తూ రైతుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలు సంస్కరణలు అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొంటూ సాగు వ్యయాన్ని తగ్గించడం, ఉత్పాదకతను పెంచడం, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంపై దృష్టి సారించినట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన

-మిగతా 2 లో

# మమత పార్టీ పేరు, గుర్తు గల్లంతు..

**-ఉప ఎన్నికల ముందు దీదీకి మరో భారీ షాక్**
**-టీఎంసీ పేరు, పూలు--గడ్డి గుర్తును నిలిపివేసిన ఈసీ**
**-మమతా, రెబల్ వర్గాలు పాత పేరు, గుర్తు వాడొద్దని ఆదేశం**
**-రెండు వర్గాలు కొత్త పేర్లు, గుర్తులను సూచించాలని ఈసీ ఆదేశం**
**-అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజినగర్ ఉప ఎన్నికలు**
**-ఉప ఎన్నికల్లో కొత్త పేరు, గుర్తులతోనే పోటీ చేయాల్సిన పరిస్థితి**
**-ఈసీ నిర్ణయాన్ని మమతా వర్గం వ్యతిరేకించింది**
**-రెబల్ వర్గం ఈసీ నిర్ణయాన్ని సమర్థించింది**
**-రెండు వర్గాలకు వేర్వేరు తాత్కాలిక పేర్లు, గుర్తులు కేటాయించిన ఈసీ**



మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని టీఎంసీ పార్టీకి ఎన్నికల సంఘం షాకిచ్చిన సంగతి తెలిసిందే. ఆ పార్టీ పేరును, గుర్తును ఇటు మమత వర్గం, రెబల్స్.. ఎవరూ వాడకూడదని ఎన్నికల సంఘం గురువారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం టీఎంసీ పార్టీలో పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు రెబల్స్‌గా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీఎంసీ పార్టీ పేరును, పార్టీ గుర్తు అయిన పూలు-గడ్డి గుర్తును తమకే ఇవ్వాలంటూ ఈసీని కోరారు.దీనిపై మమత ఆధ్వర్యంలోని టీఎంసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. వచ్చే నెలలో పశ్చిమ బెంగాల్‌లో రెండు స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ పేరు, గుర్తు అంశం కీలకంగా మారింది. దీంతో దీనిపై ఎన్నికల సంఘం స్పందించింది. ఇప్పటికిప్పుడు పార్టీ పేరు (టీఎంసీ)ని, గుర్తును ఎవరికీ కేటాయించలేమని ఈసీ తెలిపింది. అందుకే, తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఈ పార్టీ పేరును, గుర్తును రెండు వర్గాల్లో ఎవరూ ఉపయోగించకూడదని ఆదేశించింది. రాబోయే ఉప ఎన్నికల కోసం కొత్త పేరు, గుర్తు కేటాయిస్తామని ఇరు వర్గాలకు తెలిపింది. శుక్రవారం ఉదయం 11.00 గంటలలోపు మమత వర్గం, రెబల్ వర్గం.. తమ పార్టీ పేర్లు, గుర్తను సూచిస్తూ ఈసీకి తెలపాలని కోరింది. దీంతో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ వర్గం.. తమ పార్టీ పేరు, గుర్తును ఎంపిక చేసుకుంది. ఈ మేరకు ఈసీకి మెయిల్ ద్వారా సమాచారమిచ్చినట్లు తెలుస్తోంది. వీటిని పరిశీలించనున్న ఈసీ.. మమత వర్గానికి, రెబల్ వర్గానికి వేర్వేరుగా పార్టీల పేర్లు, గుర్తులను కేటాయించనుంది. అయితే, ఈసీ నిర్ణయాన్ని మమతా బెనర్జీ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తమ పార్టీ గుర్తును తమకు కేటాయించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. అయితే, ఈ నిర్ణయాన్ని రెబల్ గ్రూప్ సమర్థించింది. అక్టోబర్ 6న పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజినగర్ అసెంబ్లీ స్థానాలకు ఎన్నిక జరగనుంది. ఇప్పుడు ఈసీ కేటాయించే గుర్తుపైనే మమత వర్గం అయినా.. రెబల్ గ్రూప్ అయినా పోటీ చేయాలి. టీఎంసీ పేరు, పూలు-గడ్డి గుర్తు ఉండదు.

# పిల్లల పాస్‌పోర్ట్‌పై కొత్త రూల్స్

**-15 ఏళ్లలోపు వారికి ఐదేళ్లే వ్యాలిడిటీ**
**-18 ఏళ్ల వరకు మాత్రమే చెల్లుబాటు**
**-వయసును బట్టి తగ్గనున్న వ్యాలిడిటీ**
**-13 ఏళ్ల వయసులో తీసుకుంటే ఐదేళ్ల కాలపరిమితి**
**-18 ఏళ్లు దాటితే కొత్త పాస్‌పోర్ట్ తప్పనిసరి**
**-పిల్లల పాస్‌పోర్ట్‌లో 36 పేజీలే**
**-పాస్‌పోర్ట్ ఫీజుల్లోనూ మార్పులు**



: దేశంలో పాస్‌పోర్ట్ రూల్స్ మారిపోనున్నాయి. ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ కొత్త రూల్స్‌కు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను గురువారం, సెప్టెంబర్ 17న విడుదల చేసింది. కొత్త నిబంధనల ప్రకారం.. 15 ఏళ్లలోపు పిల్లలకు జారీ చేసే పాస్‌పోర్టు వ్యాలిడిటీ ఇకపై ఐదేళ్ల కాలపరిమితితోనే ఉంటుంది. అలాగే, 18 ఏళ్లు వచ్చే వరకు మాత్రమే వ్యాలిడిటీ కలిగి ఉంటుంది.18 ఏళ్ల తర్వాత జారీ అయ్యే పాస్‌పోర్టు మాత్రమే అదనపు వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. ఈ అంశంలో ఇప్పటికే ఉన్న పాస్‌పోర్ట్ రూల్స్, 1980 చట్టానికి కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మార్పులు చేసింది. పాస్‌పోర్ట్స్ (అమెండ్‌మెంట్) రూల్స్, 2026 పేరిట కొత్త నిబంధనలతో గురువారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి సంబంధించి సవరించిన రూల్ 12 (1ఏ) ప్రకారం.. 15 ఏళ్లలోపు వారికి 36 పేజీల పాస్‌పోర్టు జారీ చేస్తారు. 15 ఏళ్ల వయసులో తీసుకుంటే.. ఐదేళ్ల కాలపరిమితికి గాను 20 ఏళ్లు వచ్చే వరకు వ్యాలిడిటీ ఉండదు. గరిష్టంగా 18 ఏళ్ల వరకు మాత్రమే దీని వ్యాలిడిటీ ఉంటుంది. 13 ఏళ్లకు పాస్‌పోర్ట్ జారీ అయితే ఐదేళ్ల వ్యాలిడిటీతో 18 ఏళ్ల వరకు వాడుకోవచ్చు. అలాగే, 14, 15 ఏళ్లు అయితే.. గరిష్టంగా మరో నాలుగు, ఐదు సంవత్సరాల వ్యాలిడిటీ మాత్రమే వస్తుంది. 18 ఏళ్లు వచ్చిన వారు కొత్త పాస్‌పోర్టు తీసుకోవాల్సిందే. పిల్లలకు జారీ చేసే పాస్‌పోర్టులో గరిష్టంగా 36 పేజీలు మాత్రమే ఉంటాయి. పాస్‌పోర్టు దరఖాస్తు ఫీజులను ప్రభుత్వం ఇటీవల సవరించిన సంగతి తెలిసిందే. ఫీజులు పెంచుతూ అమెండ్‌మెంట్ రూల్ 8ను తీసుకొచ్చింది. దీనిపై ఇటీవలే నోటిఫికేషన్ జారీ చేసింది.

# పాకిస్థాన్ మసీదులో ఆత్మాహుతి దాడి..

-ప్రార్థనలు చేస్తుండగా మసీదులో ఆత్మాహుతి దాడి
-ఖైదర్ పఖ్తుంఖ్వాలో ఘటన
-దాడిలో 21 మంది మృతి
-70 మందికి పైగా గాయాలు.. ఆస్పత్రుల్లో చికిత్స
-మృతుల్లో 15 మంది పోలీసులు
-క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమం
-సహాయక చర్యలు చేపట్టిన రెస్క్యూ సిబ్బంది
-మృతుల సంఖ్య పెరిగే అవకాశం
-దాడికి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థా బాధ్యత ప్రకటించలేదు



**ఇస్లామాబాద్**
పాకిస్థాన్‌లోని ఖైదర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలోని ఓ మసీదులో శుక్రవారం ఆత్మాహుతి దాడి జరిగింది. ప్రార్థనలు చేస్తున్న సమయంలో ఈ దాడి జరగ్గా.. 21 మంది మృతి చెందారు. 70 మందికి పైగా గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్నారు.మృతుల్లో 15 మంది పోలీసులు కూడా ఉన్నారు.రెస్క్యూ సిబ్బంది సహాయక కార్యక్రమాలు చేపట్టారు. పలువురికి తీవ్రంగా గాయాలు కావడంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఈ దాడిపై ఇప్పటి వరకు ఏ ఉగ్రవాద సంస్థ ప్రకటన చేయలేదు.

# డిజిటల్ వ్యవసాయంలో ఏపీ దూకుడు

మొదటి తరువాయి

దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రుల సదస్సులో రాష్ట్రంలో అమలవుతున్న కార్యక్రమాలు, సాంకేతిక సంస్కరణలను వివరించారు. రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

52.08 లక్షల మంది రైతులకు ఫార్మర్ ఐడీలు

డిజిటల్ అగ్రిమిషన్ లో భాగంగా అగ్రిస్టాక్ అమలులో రాష్ట్రం 86.8 శాతం లక్ష్యాన్ని సాధించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 60 లక్షల పిఎం కిసాన్ లబ్ధిదారుల్లో 52.08 లక్షల మందికి ఫార్మర్ ఐడీలు రూపొందించినట్లు చెప్పారు. ఖరీఫ్ 2026లో డిజిటల్ పంటల సర్వే ద్వారా సుమారు 68 లక్షల మంది రైతులకు చెందిన 97 లక్షల ఎకరాల పంట విస్తీర్ణాన్ని నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ సమాచారాన్ని పంటల విస్తీర్ణం, దిగుబడి అంచనాలకు వినియోగిస్తున్నామని, ఎరువుల పంపిణీ, కనీస మద్దతు ధర కొనుగోళ్లు, పంటల బీమా తదితర సేవలతో అగ్రిస్టాక్‌ను అనుసంధానిస్తున్నామని వివరించారు.

ఎరువుల వినియోగంలో 22 శాతం ఆదా

ఏపీఏఐఎంఎస్ 2.0 ద్వారా ఎరువుల పంపిణీలో పారదర్శకత పెంచినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుల వివరాలు, కమతం విస్తీర్ణం, సాగు పంట ఆధారంగా శాస్త్రీయ సిఫార్సుల మేరకు యూరియా, డీఏపీ పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు సుమారు 24.69 లక్షల మంది రైతులు డిజిటల్ విధానంలో ఎరువులు కొనుగోలు చేశారని చెప్పారు.

అగ్రిస్టాక్‌కు కేంద్ర సహకారం కోరిన మంత్రి

సమగ్ర డిజిటల్ వ్యవసాయ వ్యవస్థ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని అచ్చెన్నాయుడు కోరారు. భూ రికార్డుల అనుసంధానంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని, జియో రిఫరెన్స్ చేసిన గ్రామ పటాల ధృవీకరణను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అగ్రిస్టాక్ ఆధారిత కొనుగోళ్లు, పంటల బీమా వంటి సేవలకు వివిధ శాఖల మధ్య డేటా అనుసంధానాన్ని సులభతరం చేయాలని కోరారు.

# హార్డ్‌వేర్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్



మొదటి తరువాయి

పెట్టుబడులకు ఆమోదం లభించిన ప్రతి ప్రాజెక్టు ఆరు నెలల్లో పనులు ప్రారంభించేలా పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. సెమీ కండక్టర్లు

చిప్ తయారీ, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి వంటి ఎలక్ట్రానిక్స్ హబ్‌లలో మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాలని అన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీతో పాటు పరిశోధన, డిజైన్, తయారీ రంగాలను అనుసంధానిస్తూ పూర్త్యస్థాయి ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. సోలార్ ప్యానెళ్లతో పాటు అనుబంధ పరిశ్రమలు, క్వాంటమ్ టెక్నాలజీ, హైపెర్‌స్కేల్ కంప్యూటింగ్ రంగాల్లో పరిశోధన, తయారీ సంస్థలను ప్రోత్సహించాలని ఆదేశించారు. డ్రోన్, స్పేస్ సీఈఓ సమీపంలో అనుబంధ పరిశ్రమల క్లస్టర్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపందించాలని సూచించారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ తయారీ ఎకోసిస్టమ్ అభివృద్ధికి టెక్నాలజీ సంస్థలతో సంప్రదింపులు జరుగుతున్నట్లు మంత్రి నారా లోకేష్ తెలిపారు.

పోర్టుల చుట్టూ పరిశ్రమల విస్తరణ

రాష్ట్రంలోని అన్ని పోర్టుల వద్ద ఉన్న భూమిని వాణిజ్యపరంగా సమర్థవంతంగా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. పోర్టులతో పాటు లాజిస్టిక్స్, షిప్‌బిల్డింగ్, గోదాములు, తయారీ, అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళిక రూపందించాలని అన్నారు. ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధి తో పాటు కార్గో, రక్షణ, పర్యాటక అవసరాలకు అనుగుణంగా షిప్‌బిల్డింగ్ కార్యకలాపాలను విస్తరించాలని సూచించారు.

పోర్టులు - షిప్‌బిల్డింగ్ - లాజిస్టిక్స్ - పరిశ్రమలను అనుసంధానించి ఏపీని లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. రైలు, రోడ్డు, ఎయిర్ కార్గో, అంతర్గత జల రవాణా మార్గాలను అనుసంధానం చేయాలని సూచించారు.

ఎగుమతుల్లో తిరుపతికి 10వ స్థానం

శ్రీసిటీ కారణంగా తిరుపతి జిల్లా ఎగుమతుల్లో దేశంలో 10వ స్థానంలో నిలిచిందని సీఎం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా 12వ స్థానంలో ఉందని, దాన్ని టాప్-5లోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర యువత నైపుణ్యాల్లో ముందంజలో 10వ తరగతి నుంచే స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించాలని అన్నారు. స్కిల్ మ్యాపింగ్ చేపట్టి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించాలని సూచించారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ఉన్న అవకాశాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. అగ్రి - బేస్డ్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించాలని సూచించారు. ఎంఎస్ఎంఈల విస్తరణకు 'వన్ ఫ్యామిలీ - వన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని ప్రోత్సహించాలని అన్నారు.

రేర్ ఎర్త్ మినరల్స్‌పై దృష్టి

రేర్ ఎర్త్ మినరల్స్ ఆధారిత ప్రాసెసింగ్, విలువ ఆధారిత పరిశ్రమలు, పరిశోధన, తయారీ రంగాలను అనుసంధానించే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. టీటీడీ పరిధిలో సోలార్, పవన విద్యుత్ ఉత్పత్తి అవకాశాలను వినియోగించుకోవాలని, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్‌పై దృష్టి పెట్టాలని అన్నారు. టీటీడీలో నెట్ జీరో లక్ష్య సాధనకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే 511 ఛార్జింగ్ స్టేషన్లకు అనుమతులు ఇచ్చినట్లు సమావేశంలో అధికారులు తెలిపారు. రాష్ట్రం నిర్దేశించుకున్న 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో 113.75 గిగావాట్లకు సంబంధించి పెట్టుబడులు సాధించినట్లు అధికారులు వివరించారు. డిసెంబర్ 17, 18 తేదీల్లో ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో హైడ్రోజన్ వ్యాలీ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

21 ఎస్ఐపీబీ సమావేశాల్లో 387 ప్రాజెక్టులు

ఇప్పటివరకు జరిగిన 21 ఎస్ఐపీబీ సమావేశాల్లో మొత్తం 387 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా రూ.14.05 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.79 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# అంబటి రాంబాబుకు మరో షాక్..

మొదటి తరువాయి

రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

**గతంలోనే అంబటి రాంబాబుపై పలు కేసులు నమోదు**

గతంలోనే అంబటి రాంబాబుపై పలు పోలీస్ కేసులు నమోదు కావడంతో పాటు, ఆయన సుమారు 18 రోజుల పాటు రిమాండ్‌లో కూడా ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే అభియోగంపై తిరుపతి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి విచారణకు రావాలని ఇటీవల నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. వీటికి తోడు ఇప్పుడు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వ్యవహారాల్లో ఈడీ అధికారులు నోటీసులు ఇవ్వడం గమనార్హం.

ఈడీ నోటీసులు రావడంపై వైసీపీ నాయకుల మండిపాటు

మరోవైపు, అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు రావడంపై వైసీపీ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే పోలీసులను, కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి తమ నేతలపై కుట్రపూరితంగా కేసులు బనాయిస్తోందని ఆరోపిస్తున్నారు

# సెమీస్‌లో భారత్..


**-క్వార్టర్‌ఫైనల్లో జపాన్‌పై భారత్‌కు 8 వికెట్ల విజయం**
**-57 పరుగులకే జపాన్‌ను కుప్పకూల్చిన భారత బౌలర్లు**
**-తెలుగు తేజం శ్రీ చరిణి 4 వికెట్లతో సత్తా**
**-షెఫాలీ వర్మకు 2 వికెట్లు.. బ్యాటింగ్‌లోనూ మెరుపు ఇన్నింగ్స్**
**-15 బంతుల్లో 40 పరుగులతో షెఫాలీ వర్మ విధ్వంసం**
**-6 ఫోర్లు, 2 సిక్సర్లతో చెలరేగిన షెఫాలీ**
**-5 ఓవర్లలోనే 2 వికెట్లకు 59 పరుగులు చేసిన భారత్**
**-మరో 90 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించిన భారత్**
**-రిచా ఘోష్ 6 బంతుల్లో 12 నాటౌట్‌తో ఆకట్టుకుంది**




**నిస్సిన్ (జపాన్)**
ఆసియా క్రీడల్లో భారత మహిళల క్రికెట్ జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మెరుగైన ర్యాంక్‌తో నేరుగా క్వార్టర్‌ఫైనల్లో బరిలోకి దిగిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ఆతిథ్య జపాన్‌ను చిత్తు చేసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో 58 పరుగుల లక్ష్యాన్ని మరో 90 బంతులు ఉండగానే 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఛేదనలో ఓపెనర్ షెఫాలీ వర్మ (40 నాటౌట్, 15 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచికొట్టింది. కమిలిని (0), భార్తి (6) నిరాశపరిచారు. రిచా ఘోష్ (12 నాటౌట్, 6 బంతుల్లో 2 ఫోర్లు) ఆకట్టుకుంది. 5 ఓవర్లలో 2 వికెట్లకు 59 పరుగుల చేసిన భారత్ ఆడుతూ పాడుతూ సెమీస్‌కు చేరుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన జపాన్ 19.5 ఓవర్లలో 57 పరుగులకు కుప్పకూలింది. తెలుగు తేజం శ్రీ చరిణి (4/10), షెఫాలీ వర్మ (2/13) మాయ చేశారు. జపాన్ తరఫున ఓపెనర్లు అయాక (25), హరుణ (10) మాత్రమే రెండెంకల స్కోర్లు సాధించారు.

# నేడు ఏపీలో వర్షాలు

మొదటి తరువాయి



మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు

ఈ అల్పపీడనం క్రమంగా బలపడి, రానున్న మూడు నాలుగు రోజుల్లో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని ఆయన వివరించారు. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటాయని అంచనా వేస్తున్నారు.

శనివారం రోజున...పలు జిల్లాల్లో

పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం

మన్యం, అల్లూరి, పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ తెలిపింది. మిగిలిన జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు పడతాయని పేర్కొంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఈ నేపథ్యంలో, వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని హెచ్చరించింది

# యూపీఐ చార్జీలతో అమెరికా కంపెనీలకే లబ్ధి!

న్యూఢిల్లీ : రూ.2,000 పైబడిన యూపీఐ లావాదేవీలపై 0.4% మర్చంట్ ఫీజు వసూలు చేయాలన్న మోదీ సర్కార్ ప్రణాళిక ఎక్కువగా అమెరికా కంపెనీలకే లబ్ధి చేకూర్చనున్నది. వాణిజ్య నిపుణుల ప్రకారం.. ఈ ఫీజు అమెరికా కంపెనీ వాల్‌మార్ట్‌కు చెందిన ఫోన్ పేకు కొత్త ఆదాయ వనరును సృష్టించడంతోపాటు త్వరలో చేపట్టనున్న ఐపీవోకు ముందు దాని విలువను పెంచే అవకాశం ఉన్నది. భారత్ ఉచిత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, రూపే నెట్‌వర్క్ తమకు ప్రతికూలంగా మారాయని అమెరికా కంపెనీలు చాలాకాలంగా వ్యక్తం చేస్తున్న ఆందోళనలను కూడా ఈ చర్య కొంతవరకు తగ్గించవచ్చు. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్(జీటీఆర్ఐ) పేర్కొన్న అంచనాల ప్రకారం.. యూపీఐ లావాదేవీల్లో 80 శాతానికి పైగా ఫోన్ పే, గూగుల్ పే కలిపి నిర్వహిస్తున్నాయి.

అందువల్ల ఈ మార్పు ముఖ్యంగా ఈ రెండు సంస్థలకు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉన్నది. అయితే దీని ప్రభావం యూపీఐ ఆపరేటర్లకే పరిమితం కాదు. అంతర్జాతీయ కార్డ్ నెట్‌వర్క్‌లైన వీసా, మాస్టర్‌కార్డ్ పోటీ స్థితిని కూడా ఈ మార్పు మెరుగుపరచవచ్చని జీటీఆర్ఐ వాదిస్తున్నది. యూపీఐతో పోలిస్తే కార్డ్ చెల్లింపులపై ఉండే వ్యయ వ్యత్యాసం తగ్గడమే దీనికి కారణమని చెప్తున్నది. క్రెడిట్ కార్డుకు ఎండీఆర్ 1.5% నుంచి 2.5% వరకు, డెబిట్‌కార్డుకు 0.9% వరకు ఉన్నది. కొత్త యూపీఐ రేటు 0.4% క్రెడిట్, డెబిట్ కార్డుల ఎండీఆర్ కంటే తక్కువగా ఉన్నది. భారత్‌లో సున్నా ఖర్చుతో కూడిన యూపీఐ వ్యవస్థ, చెల్లింపుల మార్కెట్‌లో రూపే స్థానం కలిసి వీసా, మాస్టర్‌కార్డ్ వంటి అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ఇప్పటివరకు ప్రతికూల స్థితితో ఉంచాయని థింక్‌ట్యాంక్ చెప్తున్నది. అయితే యూపీఐపై చార్జీలు విధించడం కార్డ్ నెట్‌వర్క్‌ల పోటీ సమీకరణాన్ని మారుస్తుందని జీటీఆర్ఐ తెలిపింది.




విదేశీల కంపెనీలకు అదనపు ఆదాయం!

ఈ నిర్ణయంపై అమెరికా ఒత్తిడి ప్రభావం చూపిందన్న వాదనలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తిరస్కరించారు. కొత్త విధానం స్థిరమైన చెల్లింపుల వ్యవస్థను రూపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది. అయితే భారతదేశపు పబ్లిక్ డిజిటల్ పేమెంట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఉపయోగిస్తున్న విదేశీ యాజమాన్యంలోని టెక్నాలజీ కంపెనీలకు అదనపు ఆదాయాన్ని సృష్టించడానికి భారతీయ వ్యాపారులు, వినియోగదారులు సహాయపడాలా అని జీటీఆర్ఐ ప్రశ్నించింది. యూపీఐని భారతీయ ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు అభివృద్ధి చేశాయని, అయితే జీటీఆర్ఐ పేర్కొన్న అంచనాల ప్రకారం ఇప్పుడు ఫోన్ పే, గూగుల్ పే కలిపి 80 శాతానికి పైగా లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్నాయని థింక్ ట్యాంక్ పేర్కొన్నది. ప్రభుత్వ మౌలిక సదుపాయాలను ఉపయోగిస్తున్న విదేశీ ప్లాట్‌ఫామ్‌లపై భాగస్వామ్య రుసుం విధించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని జీటీఆర్ఐ వాదిస్తున్నది. భవిష్యత్తులో ఇతర యూపీఐ లేదా రూపే లావాదేవీలకు కూడా ఫీజులను విస్తరించే అవకాశం ఉన్నదని చెప్తున్నది.

జీటీఆర్ఐ, భారతీయ ఫిన్‌టెక్ ప్రచురణ సంస్థ పేర్కొన్న అంచనాల ప్రకారం ఫోన్ పే యూపీఐ లావాదేవీల్లో 45 శాతం నిర్వహిస్తుండగా, గూగుల్ పే సుమారు 35 నుంచి 40 శాతం వరకు వాటాను కలిగి ఉన్నది. ఈ అంచనాల ప్రకారం లావాదేవీల పరిమాణంలో ఈ రెండు ప్లాట్‌ఫామ్‌లు కలిపి 80 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్నాయి. ఫోన్ పేలో సుమారు 70 శాతం వాటా వాల్‌మార్ట్‌ది కాగా, గూగుల్ పేకు అమెరికాకు చెందిన గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ యజమాని. కొత్త ఎండీఆర్ వల్ల ఇంతకుముందు తక్కువ లేదా ఎలాంటి మర్చంట్ ఫీజు ఆదాయం రాని లావాదేవీల నుంచి చెల్లింపు యాప్‌లు ఆదాయం పొందే అవకాశం ఏర్పడుతున్నది. అయితే 0.4% మొత్తాన్ని చెల్లింపు యాప్‌లు పూర్తిగా తమ వద్ద ఉంచుకోవు. ఎండీఆర్‌ను బ్యాంకులు, చెల్లింపు వ్యవస్థలోని ఇతర భాగస్వాముల మధ్య పంచుతారు. గతంలో పరిశ్రమ అంచనాల ప్రకారం, థర్డ్ పార్టీ పేమెంట్ ప్రొవైడర్లకు సుమారు 30 శాతం, మిగిలిన మొత్తాన్ని జారీ చేసే బ్యాంకులు, అక్వైరింగ్ బ్యాంకులు పొందవచ్చని అంచనాలు ఉన్నాయి. అయితే ఫోన్ పేకు భారీ లావాదేవీల ఆధారంగా లభించే ఆదాయ పూల్‌లో కొంతభాగం కూడా ఆర్థికంగా గణనీయంగా మారవచ్చు.

వినియోగదారులపై భారం ఉండదా?

2026 ఆగస్టులో యూపీఐ 2,451 కోట్ల లావాదేవీలను ప్రాసెస్ చేసింది. వీటి విలువ రూ.29.9 లక్షల కోట్లు. ఈ లావాదేవీల్లో కొంత భాగంపై చిన్న మొత్తంలో ఫీజు విధించినా అది గణనీయమైన ఆదాయాన్ని సృష్టించే అవకాశం ఉన్నది. పరిశ్రమ, బ్రోకరేజ్ సంస్థల అంచనాల ప్రకారం.. వ్యవస్థ పూర్తిగా అమల్లోకి వచ్చిన తర్వాత వార్షిక ఎండీఆర్ ద్వారా సుమారు రూ. 16,000 కోట్ల నుంచి రూ.20,000 కోట్ల వరకు ఆదాయ పూల్ ఏర్పడే అవకాశం ఉన్నది.

# పులిమామిడి పాఠశాలలో ఉపాధ్యాయుడి తీరుపై వివాదం..

**తరగతి గదిలో బైబిల్ బోధన, విద్యార్థులపై దాడుల ఆరోపణలు!**



**( నేటి దర్శిని ) వికారాబాద్ జిల్లా**
నవాబుపేట్ మండలం పులిమామిడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సుధాకర్ గారిపై విద్యార్థులు పిర్యాదు మేరకు స్థానిక బీజేపీ నాయకుల దృష్టికి వచ్చాయి.
విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం, ఉపాధ్యాయుడు పాఠశాలకు బైబిల్ తీసుకువచ్చి తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన సమయంలో బైబిల్ చదువుతున్నారని, అలాగే క్రైస్తవ మతంలోకి మారాలని ఆ మతం మంచిదని అలాగే చేతబడి ఎలా చేస్తారు అని విద్యార్థులకు చెబుతున్నారని ఆరోపణలు వచ్చాయి.. విద్యార్థుల మత విశ్వాసాలు, వ్యక్తిగత అభిప్రాయాలను గౌరవిస్తూ, పాఠశాల తరగతి గదిలో విద్యాబోధనకే ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.
అదేవిధంగా, ఉపాధ్యాయుడి మాట వినని విద్యార్థులను అనవసరంగా దూషించడం, బూతు మాటలు మాట్లాడటం, చేతులతో కొట్టడం, కట్టెతో కొట్టడం, కాలితో తన్నడం వంటి శారీరకంగా మరియు మానసికంగా ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నారని కొంతమంది విద్యార్థులు తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు.

# విశ్వేశ్వరయ్య కాలనీలో భక్తిశ్రద్ధలతో గణపతి పూజలు



**బిన్ రెడ్డి నగర్. సెప్టెంబర్ 18 ( నేటి దర్శిని )**
బిన్ రెడ్డి నగర్‌లోని విశ్వేశ్వరయ్య కాలనీలో గణపతి నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా ఐదవ రోజు గణపతి పూజతో పాటు గణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు గణనాథుని ఆశీస్సులతో కాలనీలో సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ప్రార్థించారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కాలనీ వాసులు తెలిపారు. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని గణనాథుని కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వంగ స్పందన, కల్పన, సుధారాణి, సాత్విక్, భాను ప్రకాష్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు

**-షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ**
**-బొబ్బిలి చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18 ( నేటి దర్శిని )**
ఫరూఖ్‌నగర్‌లోని బొబ్బిలి చెరువు వద్ద గణేష్ నిమజ్జనానికి చేపట్టిన ఏర్పాట్లను షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ సీతారాం, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రత, పారిశుధ్యం, ఇతర సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎసిపి లక్ష్మీనారాయణ సూచించారు. భక్తులు, గణేష్ ఉత్సవ కమిటీలకు అవసరమైన సహకారం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పెంటయ్య, శ్రీశైలం గౌడ్, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ నాయకత్వానికి జేజేలు

**-బీఆర్ఎస్‌లో చేరిన కమ్మదనం ఉపసర్పంచ్ జగన్,వార్డు మెంబర్ మహేష్**

**-ఉపసర్పంచ్ జగన్,వార్డు మెంబర్ మహేష్ తో పాటు నాయకులు,కార్యకర్తలు**

**-పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 18 ( నేటి దర్శిని**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరుక్ నగర్ మండలం కమ్మదనం గ్రామానికి చెందిన బహుజన్ సమాజ్ పార్టీ (బీస్పా) ముఖ్య నాయకులు,కార్యకర్తలు ఉపసర్పంచ్ జగన్ మరియు మహేష్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో భారత్ రాష్ట్ర సమితి (బీ=రా) పార్టీలో చేరారు.ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.కేసీఆర్ నాయకత్వాన్ని,పార్టీని నమ్మి వచ్చిన ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, కమ్మదానం గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.పార్టీ లో చేరినవారు మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు.ఆయన అందిస్తున్న ప్రజా చొరవ, అభివృద్ధి పనులకు ఆకర్షితులమై తామంతా బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు వెల్లడించారు.

**బీఆర్ఎస్ పార్టీలోచేరినవారు:**
ఉపసర్పంచ్ జగన్,వార్డు మెంబర్ పి.మహేష్ నాయకులు కె.యాదయ్య, ఇ.కేశవ్,కె.రమేష్,ఎస్.వంశీ, జె.హరి,ఇ.శివ కుమార్,ఇ. యాదగిరి,కె.నవీన్,టి.అభిషేక్, పి.వర్ధన్,పి.మున్నా,జె.లోకేష్, పి.విజయ్, పి.కుశ, పి.బన్ని, బి.చందు మరియు కె.శ్రీశైలం తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.
ఈ కార్యక్రమంలో కమ్మదనం సర్పంచ్ లత కిరణ్ కుమార్ గౌడ్,గ్రామ కమిటీ అధ్యక్షులు శివగళ్ల రాజు,నాయకులు రాఘవేందర్ రెడ్డి,శ్రీశైలం,శివగళ్ల వెంకట్,చెన్నయ్య గౌడ్,బాల్ రాజ్,నర్సిములు,శివగాళ్ల నర్సిములు,యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభా కేంద్రాలుగా ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు..

**-ఏఐ స్కిల్స్ తప్పనిసరి చేయాలని నారా లోకేశ్ ఆదేశాలు**

**-నిమ్మకూరులో ఐఐటీ-జేఈఈ/నీట్ అకాడమీ ఏర్పాటుకు ఆమోదం**

**-10 రెసిడెన్షియల్ స్కూళ్లను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయం**

**-విద్యార్థులకు ఏఐ స్కిల్స్‌తో పాటు కంప్యూటర్ ల్యాబ్స్ తప్పనిసరి**

**-సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం**



**ఉండవల్లి,అమరావతి, ఏపీ బ్యూరో, ( నేటి దర్శిని )**
రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలను (ఏపీఆర్ఎస్) ప్రతిభావంతులను తయారుచేసే అత్యుత్తమ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ 59వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ విద్యా వ్యవస్థను సమూలంగా బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**ప్రతిభావంతులను తయారు చేసే కేంద్రాలుగా మారాలి**

ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు అకడమిక్ ఎక్సలెన్స్‌పై దృష్టి సారించి, ప్రతిభావంతులను తయారు చేసే కేంద్రాలుగా మారాలి" అని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తొలిసారిగా పత్రికా ప్రకటనల ద్వారా అభినందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటివరకు రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన వారిలో 27 మంది ఐఏఎస్‌లు, 20 మంది ఐపీఎస్‌లు, 13 మంది ఐఆర్ఎస్‌లు, నలుగురు ఐఎఫ్ఎస్‌లతో పాటు ఎందరో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని అధికారులు వివరించగా, మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు.

**విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లో నైపుణ్య శిక్షణను తప్పనిసరి చేయాలి**

టెక్నాలజీలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో నైపుణ్య శిక్షణను తప్పనిసరి చేయాలని, అన్ని స్కూళ్లలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

**విద్యా సంస్థలను 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లుగా అభివృద్ధి**

రాష్ట్రవ్యాప్తంగా 10 ఏపీఆర్ విద్యా సంస్థలను 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇప్పటికే తాడికొండ, కొడిగినహళ్లి పాఠశాలలు ఈ జాబితాలో ఉన్నాయి.

**జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోద ముద్ర**

కృష్ణా జిల్లా నిమ్మకూరులోని ఏపీఆర్ జూనియర్ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ-జేఈఈ/నీట్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరో 6 రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా సమావేశం ఆమోద ముద్ర వేసింది.

**పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం**

సిబ్బంది సంక్షేమానికి సంబంధించి కూడా పలు ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. ఏపీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. గెస్ట్ ఫ్యాకల్టీ గౌరవ వేతనాలను ఇతర సొసైటీలతో సమానంగా పెంచడంతో పాటు, పీఈటీలను పీడీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు అంగీకరించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది నియామకాలకు స్టాఫింగ్ ప్యాట్రన్‌కు ఆమోదం తెలిపారు.

**మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి**


అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లలో శాశ్వత భవనాలు, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, ఆటోమేటెడ్ స్మార్ట్ కిచెన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. విద్యార్థుల వైద్య అత్యవసర పరిస్థితుల కోసం లక్ష రూపాయల వరకు ఖర్చు చేసే అధికారాన్ని సొసైటీ సెక్రటరీకి కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

**భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రపంచస్థాయి క్రీడా హబ్‌గా**

జగ్గంపేట నియోజకవర్గంలోని భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రపంచస్థాయి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించాలని లోకేశ్ ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జే. శ్యామలరావు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ రంజిత్ బాషా, ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఏపీఆర్ఈఐఎస్ కార్యదర్శి కృష్ణమోహన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# ఏకదంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

**- బ్రహ్మశ్రీ పసర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ**



**( నేటి దర్శిని )ఆర్కేపురం**
రామకృష్ణాపురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘము వారి ఆధ్వర్యంలో మహా గణపతి 39వ నవరాత్రి మహోత్సవాల లో భాగంగా నాలుగు వ రోజు నిర్వహించిన పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా విచ్చేసిన శ్రీ భారతీ తీర్థ పురస్కార గ్రహీత, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త, శంకర తత్వార్థ రత్నాకర, ధర్మారక్ష దురీణ, సనాతన ధర్మోద్ధారక, ఆర్ష విద్యా తపస్వి, అర్థ విజ్ఞాన భాస్కర, తత్వ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బ్రహ్మశ్రీ పసర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారికి బహుమతులను ప్రధానం చేశారులిఈ కార్యక్రమంలో వాసవి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్ గుప్త, కాలనీ ప్రధాన కార్యదర్శి లిఅయిత అంజయ్య ,ట్రేసురర్ కృష్ణయ్య , ఉత్సవ కమిటీ కన్వీనర్ లివెంపటి కృష్ణమోహన్, చిలుక ఉపేందర్ రెడ్డి, గౌరిశెట్టి అరుణ్ కుమార్, వనమా సుదర్శన్, గ్రంథి రమేష్, మాలే అనిల్, తమన్నా శ్రీధర్, గ్రాంది. శ్రీకాంత్, దండు రాజు, గౌరీ శంకర్, ణతీ. రాంకిషన్, సత్యనారాయణ, మాలే శ్రీనివాస్, కృష్ణ మూర్తి, రామ స్వామి, మేఘమాల, భ్రమరాంబ, రాధా తదితరులు పాల్గొన్నారు.




# 'ది ప్యారడైజ్' చిత్రానికి మరో టైటిల్ పెట్టాల్సి వస్తే అది 'సమ్మక్క' : నాని




నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ మూవీ 'ది ప్యారడైజ్' . ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది చిత్రయూనిట్.అయితే ప్రమోషన్స్‌లో భాగంగా కథనాయకుడు నాని ఈ సినిమా టైటిల్‌పై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. నాని మాట్లాడుతూ.. ఒకవేళ తమ సినిమాకు 'ది ప్యారడైజ్' కాకుండా వేరే ప్రత్యామ్నాయ శీర్షిక పెట్టాల్సి వస్తే మాత్రం ఖచ్చితంగా 'సమ్మక్క' అనే టైటిల్ సరిగ్గా సరిపోతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం నాని చేసిన ఈ వ్యాఖ్యలు సినిమా సర్కిల్స్‌లో, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే సమ్మక్క అనేది నాని తల్లి పాత్ర పేరు అని తెలుస్తుంది. కాగా దీనిపై క్లారిటీ రావాలంటే సినిమా వచ్చేవరకు వెయిట్ చేయాలి. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. భారీ తారాగణంతో వస్తున్న ఈ సినిమా సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఆరు నెలల్లో వెయ్యికోట్లు

'పుష్ప' ఫ్రాంచైజీ, యానిమల్, ఛావా, సికిందర్, ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలతో ఒకే ఏడాది వేలకోట్ల వసూళ్లు రాబట్టి సినీ సామ్రాజ్యానికి క్వీన్‌గా అవతరించింది రష్మిక మందన్న. ఇక ఏ హీరోయిన్‌కైనా ఈ స్థాయి ట్రాక్ రికార్డు కష్టమే అని అంతా అనుకుంటున్న తరుణంలో ఉన్నట్టుండి మలయాళ భామ మమితాబైజు ఊడిపడింది. ఆర్నెల్ల క్రితం ధనుష్‌తో ఆమె నటించిన 'కర' సినిమా పెద్దగా ఆడలేదు. కానీ 50కోట్ల వసూళ్లు రాబట్టింది. ఇక అక్కడ్నుంచి మొదలైంది మమితాబైజు విజయవిహారం.ప్రదీప్ రంగనాథ్‌తో ఆమె నటించిన 'డ్యూడ్' సినిమా వందకోట్ల వసూళ్లు రాబట్టింది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి నటించిన 'జననాయగన్' 300కోట్లు, రీసెంట్‌గా విడుదలైన మలయాళ చిత్రం 'బెత్లహోమ్ కుటుంబ యూనిట్' చిత్రం 300కోట్లు, సూర్య తాజా బ్లాక్‌బస్టర్ 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో 260కోట్లు.. ఇలా కేవలం ఆరు నెలల వ్యవధిలోనే తన సినిమాల వసూళ్లతో వెయ్యికోట్ల మార్క్‌ని దాటేసింది మమితా బైజు. ఆమె నటించిన మూడు సినిమాలు వరుసగా 200కోట్ల వసూళ్లు రాబట్టడం విశేషం.



# ఓటీటీలోకి వచ్చేసిన రవితేజ 'ఇరుముడి'..



మాస్ మహారాజా రవితేజ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం 'ఇరుముడి' ఓటీటీలోకి వచ్చేసింది. టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే పవిత్రమైన భావోద్వేగాలు మరియు అంకితభావంతో కూడిన భక్తి నేపథ్యంలో రూపొందింది. థియేటర్లలో ప్రేక్షకులను ఎంతగానో అలరించిన ఈ సినిమా, ఇప్పుడు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు నేటి నుంచి (సెప్టెంబర్ 18) ప్రముఖ డిజిటల్ స్ట్రీమింగ్ వేదిక 'నెట్‌ఫ్లిక్స్ లో అధికారికంగా స్ట్రీమింగ్ అవుతోంది.కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఈ చిత్రం ఒకేసారి అందుబాటులోకి రావడం విశేషం. కుటుంబ సమేతంగా హాయిగా ఇంటి వద్దే కూర్చుని చూసేందుకు తగిన చక్కటి ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. థియేటర్లలో ఈ సినిమాను వీక్షించలేకపోయిన ప్రేక్షకులు, అభిమానులు నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ అద్భుతమైన చిత్రాన్ని వీక్షించవచ్చు.

# మహేశ్‌బాబుతో భన్సాలీ సినిమా?


అగ్ర హీరో మహేశ్‌బాబుతో ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ ఓ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారా? అంటే ఔననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. సంజయ్‌లీలా భన్సాలీ ఇటీవలే మహేశ్‌బాబుని కలిసి కథ చెప్పారని మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. భన్సాలీ శైలి భారీ సెట్లు, గ్రాండ్ విజువల్స్, బలమైన భావోద్వేగాలతో సాగే పీరియాడిక్ కథ ఇదని ప్రచారం జరుగుతున్నది. గతంలో కూడా అల్లు అర్జున్, ఎన్టీఆర్, రామ్‌చరణ్ వంటి అగ్ర హీరోలతో సంజయ్‌లీలా భన్సాలీ సినిమా చేయొచ్చనే వార్తలొచ్చాయి.అయితే ఇవేవీ కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబు-భన్సాలీ ప్రాజెక్ట్‌పై జరుగుతున్న ప్రచారం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం మహేశ్‌బాబు 'వారణాసి'పైనే తన దృష్టిని కేంద్రీకరించారు. ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదలకు సిద్ధమవుతున్నది. ఇక సంజయ్‌లీలా భన్సాలీ 'లవ్ అండ్ వార్' చిత్రం జనవరిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ రెండు చిత్రాలు పూర్తయ్యాకే మహేష్‌బాబు-సంజయ్‌లీలా భన్సాలీ సినిమాపై స్పష్టత వస్తుందంటున్నారు.



### 'ధురంధర్', 'హనుమాన్ అంశ్' చిత్రాలకు షాక్..

# ఆస్కార్ బరిలో మరాఠి సినిమా..!

భారత దేశం నుంచి అందర్నీ ఆశ్చర్యపరుస్తూ మరాఠి చిత్రం 'గొంధల్' ఆస్కార్ 2027 బరిలో నిలిచింది. వచ్చే ఏడాది అకాడమీ అవార్డులకు ఈ సినిమా అధికారికంగా ఎంట్రీ సాధించింది. ఈ ఏడాది బ్లాక్‌బస్టర్ 'ధురంధర్' సిరీస్, ఇటీవలే వసూళ్లలో పుంజుకున్న 'హనుమాన్ అంశ్' చిత్రాలను వెనక్కి నెట్టిందీ మరాఠి థ్రిల్లర్. సంతోష్ దవాష్కర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 99వ అకాడమీ అవార్డుల్లో 'బెస్ట్ ఇంటర్నేషన్ ఫీచర్ విభాగం'లో పోటీపడనుంది. ఈ విషయాన్ని భారతీయ చిత్ర సమఖ్య శుక్రవారం వెల్లడించింది.వచ్చే ఏడాది ఆస్కార్ అవార్డులకు భారత్ నుంచి మరాఠి చిత్రం గొండల్ ఎంపికైంది. బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ విభాగంలో ఈ సినిమా అధికారికంగా ఎంట్రీ సాధించింది. ఆస్కార్ నామినేషన్ కోసం దేశవ్యాప్తంగా మొత్తం 33 సినిమాలు పోటీపడ్డాయి. వీటిలో 14 హిందీ సినిమాలు ఉండగా.. తెలుగు నుంచి పెద్ది, ఇరుముడి, సింగ్ గీతం, ఎగ్వాలు రిజిష్టర్ అయ్యాయి. ఇక గుజరాతీ, మరాఠి నుంచి నాలుగేసి చిత్రలు, తమిళం నుంచి మూడు, మలయాళం నుంచి ఒకటి, నగమెసె నుంచి ఒకటి.. ఒక సైలెంట్ ఫిల్మ్ ఉన్నాయి. చివరకు సంతోష్ దవాష్కర్ తెరకెక్కించిన ఈ థ్రిల్లర్ కథాంశానికి జ్యూరీ ప్యానెల్ జై కొట్టింది. సంతోష్ 2025లో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ ఇండియాలో సిల్వర్ పికాక్ అవార్డు విజేత. 99వ ఆస్కార్ వేడుకలు 2027 మార్చి 14వ తేదీన లాస్ ఎంజెల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో జరుగనున్నాయి.



Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450